సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 23 । జనవరి । 2023



కేంద్ర మంత్రి అర్జున్‌ముండాతో పాటు ఎంపీలు బండి సంజయ్‌కుమార్, సోయం బాపూరావ్‌ను సన్మానిస్తున్న మెస్రం వంశీయులు



నాగోబా విగ్రహం

న్యూస్‌రీల్

ప్రశాంతంగా రేషన్ డీలర్ల ఎంపిక రాత పరీక్ష



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఆర్డీవో

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. స్థానిక శాంతినగర్‌లోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 328 మంది హాజరయ్యారు. ఆర్డీవో రమేశ్ రాథోడ్ పరిశీలించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ఈనెల 27న ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందని ఆయన వెల్లడించారు.

'ప్రజలను మోసం చేయడమే బీజేపీ నైజం'



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను పక్కదోవ పట్టించి మోసం చేయడమే బీజేపీ నైజమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను బీజేపీ విస్మరించిందన్నారు. సీసీఐ భూముల విషయంలో ఎంపీ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీ చైర్మన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గంతలో కేంద్రీయ విద్యాలయం కోసం ఏడెకరాల భూమిని కేటాయించగా, ఇంతవరకు పాఠశాల భవన నిర్మానానికి నిధులు కేటాయించలేదన్నారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఐటీ టవర్‌తో పాటు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వీటిని చూసి ఓర్వలేక రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జైనథ్ ఎంపీపీ గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, జగదీష్, పురుషోత్తం, పరమేశ్వర్, ఖయ్యూం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమాచారం కోసం ప్రత్యేక వెబ్‌సైట్



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన విషయాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు డీఈవో ప్రణీత తెలిపారు. ఈమేరకు డీఈవో కార్యాలయంలో విద్యాశాఖ వెబ్‌సైట్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యాలయానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పొందుపరుస్తామని, వివరాల కోసం www. deoadbdweebly. com లో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ మధుసూదన్, ఎస్‌వో మహేందర్ రెడ్డి, రాజేశ్వర్, శ్రీహరిబాబు, శివకుమార్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా చేపట్టాలి

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సీనియారిటీ జాబితా, ఖాళీలను పారదర్శకంగా చేపట్టాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు డీఈవో ప్రణీతను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. '317' బదిలీల్లో జరిగిన పొరపాట్ల వల్ల ఇప్పటికే ఎంతో మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితా తయారు చేసేటప్పుడు తప్పులు లేకుండా చూడాలని తెలిపారు. వివిధ మండలాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు సీనియారిటీ జాబితా తయారీకి ఉపాధ్యాయుల వివరాలను, సర్వీస్ రిజిస్టర్‌తో పాటు పరిశీలించాలన్నారు. తప్పులు దొర్లితే సంబంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: అఖిలభారత షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాదం గంగాధర్, గౌరవ అధ్యక్షుడిగా గులే బాపూరావు, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా ప్రభాకర్, ఎల్లయ్య, బి.సంజీత, ఉపేందర్, కోశాధికారిగా రాందాస్, సహాయ కార్యదర్శులుగా తులసీ, భగవాండ్లు, శ్యాంరావు, పోశెట్టి, సాంస్కృతిక కార్యదర్శిగా శ్యాంను ఎన్నికయ్యారు.



జాతరలో భక్తుల సందడి



ఆలయంఎదుట బారులు తీరిన భక్తులు



పిప్రీ వాయిస్తూ..

జై నాగోబా..

- ఉట్టిపడిన 'మెస్రం' సంప్రదాయం
- కేస్లాపూర్‌కు పోటెత్తిన భక్తజనం
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రత్యేక పూజలు

కైలాస్‌నగర్/ఇంద్రవెల్లి: మెస్రం వంశీయుల ఆరాధ్య దైవమైన నాగోబా జాతర వైభవంగా సాగుతోంది. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో తొలిరోజు మహాపూజతో జాతర ప్రారంభం కాగా ఆదివారం మెస్రం వంశీయుల సంప్రదాయ పూజాదీ కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి బారులు తీరి నాగోబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం శనివారం రాత్రి నుంచే భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సంప్రదాయబద్ధంగా..

నాగోబా జాతర సంప్రదాయబద్ధంగా సాగుతుంది. నూతన ఆలయంలో శనివారం అర్ధరాత్రి మహాపూజ అనంతరం మెస్రం వంశీయులు ఆనవాయితీగా వచ్చే కొత్త కోడళ్ల భేటింగ్ నిర్వహించారు. ఆదివారం మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి నీటిని తీసుకొచ్చి కొత్త కోడళ్లు నైవేద్యాన్ని వండి నాగోబాతో పాటు సతీదేవుళ్లకు సమర్పించి ఉపవాస దీక్షలు విరమించారు. రెండో రోజు జాతరకు జన సందడి కనిపించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. మంగళవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ హాజరు కానున్నారు.

సమస్యల ఏకరువు

నాగోబా దర్శనానంతరం నాగోబా దర్బార్ హాలులో బహిరంగసభ నిర్వహించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఆలయ చైర్మన్ మెస్రం తుకారాం, పీఠాధిపతి వెంకట్‌రావు, స్థానిక సర్పంచ్ రేణుకా నాగ్‌నాథ్‌లు ఆలయంలో నెలకొన్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా కేంద్ర మంత్రి మెస్రం పెద్దల వద్ద నేలపైనే తివాచీపై కూర్చుండి సమస్యలపై చర్చించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున సమావేశ మందిరంను ఏర్పాటు చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని నివేదించారు. ఇందుకు కేంద్ర మంత్రితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. సమస్యలపై ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపిస్తే వాటిని ప్రధాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని భరోసానిచ్చారు. మెస్రం వంశీయులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, యాదవ కులస్తులు, తపస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు, బీజేపీ నాయకులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను కేంద్రమంత్రికి అందజేసి తమ సమస్యలను వివరించారు. అనంతరం బీజేపీనేతలు మెస్రం పెద్దలతో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు చిట్యాల సుహాసినిరెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమేందర్‌రెడ్డి, రాళ్లబండి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పూజలు..

కేంద్ర గిరిజన వ్యవహారాలమంత్రి అర్జున్‌ముండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాగోబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కేస్లాపూర్ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న కేంద్ర మంత్రికి ఎంపీ సోయం బాపూరావ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు మెస్రం వంశీయులు, బీజేపీ శ్రేణులు సంప్రదాయ వాయిద్యాలు, థింసా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. వంశ పెద్దలు సంప్రదాయ తలాపాగాను చుట్టి ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శాలువాలతో సత్కరించి నాగోబా దేవత చిత్రపటాలను అందజేశారు. కాగా ఆదిలాబాద్ పట్టణ బీజేపీ నాయకులు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు.



గోవడ్ వద్ద పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



మెస్రం వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న కొత్త కోడళ్లు



కోనేరు నీటికోసం గోవడ్ నుంచి బయల్దేరిన మెస్రం వంశ కొత్త కోడళ్లు

క్రీడలతో మానసిక ప్రశాంతత

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

ఆదిలాబాద్: క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో డీసీసీబీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో తలమునకలై ఉండే ఉద్యోగులకు ఈ క్రీడలు ఉత్తేజానిస్తాయన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చాటినట్టే విధి నిర్వహణలోనూ మెరుగ్గా రాణిస్తూ రైతులకు అవసరమైన సేవలు అందజేయాలని సూచించారు. అనంతరం విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమెందర్, డీసీసీబీ డైరెక్టర్లు, జెడ్పీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ఆదివాసీలకు ఏం చేసిందో చెప్పాలి

- బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మెస్రం జంగుబాపు



మాట్లాడుతున్న జంగుబాపు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలకు ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మెస్రం జంగుబాపు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశమయ్యారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగోబా జాతరకు విచ్చేసిన కేంద్ర మంత్రి అర్జున్ ముండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ జిల్లాలోని ఆదివాసీలకు ఎలాంటి అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి రత్నపురం రమేశ్, జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోశెట్టి, మహిళా కన్వీనర్ ప్రేమకళ, ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షురాలు మీనా, నాయకులు సృజన్, శ్రీను, ఛత్రపతి, పోచ్చన్న, కమల, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు ఐదు రోజుల పా టు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలంగాణ బయోలజికల్ సైన్స్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కా ర్యదర్శులు రఘువేందర్, పాచ్చరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి ఐదు రోజుల పాటు జిల్లాకేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 10వ తరగతికి సంబంధించి పాఠ్యాంశాల ప్రయోగాల కిట్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హౌసింగ్.. కనుమరుగు

- గృహ నిర్మాణశాఖ ఇక చరిత్రలోకే..
- రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉద్యోగులు, సిబ్బంది ఆర్‌అండ్‌బీలో విలీనం
- ఇళ్ల నిర్మాణాలన్నీ ఇకపై ఆర్‌అండ్‌బీ పరిధిలోనే

కైలాస్‌నగర్: పేదల సొంతింటి కలను సాకారం చేసిన గృహ నిర్మాణశాఖ ఇక చరిత్రకే పరిమితం కానుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో లక్షలాది ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఒకప్పుడు వెలుగు వెలిగిన ఆ శాఖ ఇక కనుమరుగుకానుంది. కొన్నేళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు లేక స్తబ్దుగా ఉన్న గృహ నిర్మాణశాఖను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది, ఆస్తులన్నింటినీ ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం చేస్తున్నట్లు పేర్కొంది. ఇప్పటికే డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఇకపై ఇళ్ల నిర్మాణాల కార్యక్రమాలు పూర్తిస్థాయిలో కొనసాగనున్నాయి.

గతమెంతో ఘనం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహనిర్మాణశాఖకు ఘనమైన చరిత్ర ఉంది. పేదలకు సొంతింటిని అందించాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాల బాధ్యతను ఈ శాఖకే అప్పగించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం సైతం ఇందిరమ్మ పేరిట పెద్ద ఎత్తున పేదలకు ఇళ్లను నిర్మించి ఇచ్చింది. రాజీవ్‌గాంధీ పేరిట కూడా ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సమయంలో వాటి బాధ్యతలన్నీ గృహ నిర్మాణశాఖనే పర్యవేక్షించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 15 లక్షలకు పైగా గృహాలను నిర్మించి ఇచ్చిన హౌసింగ్‌శాఖ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇకపై కనుమరుగుకానుంది. ఈ శాఖ చరిత్ర అంతా గతంగా మిగిలిపోనుంది.



గృహ నిర్మాణశాఖ నోడల్ అధికారి జిల్లా కార్యాలయం

గృహ నిర్మాణ శాఖ ఇక కనుమరుగు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక, అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్) ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ప్రాధాన్యతను తగ్గించింది. అప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలన్నీ ఆ శాఖ పరిధిలోనే జరుగగా, డబుల్ బెడ్ రూం కార్యక్రమంను చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం వాటి పర్యవేక్షణ బాధ్యతలను పీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖలకు అప్పగించింది. దీంతో గృహ నిర్మాణశాఖకు చేసే పనులేమీ లేకపోవడంతో అందులో పనిచేస్తున్న ఏఈ, డీఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లను 2017-18లో పంచాయతీరాజ్‌శాఖకు బదిలీ చేశారు. ఉన్న కొద్ది పాటి అధికారులు, ఉద్యోగులతో డబుల్ బెడ్ రూం నోడల్ ఏజెన్సీగా ఇన్నాళ్లు కొనసాగుతు వచ్చింది. తాజాగా వారికి పనులేమి లేకపోవడంతో ఆశాఖను పూర్తిగా రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో పనిచేసే ఉద్యోగులను ఆర్‌అండ్‌బీలో విలీనం చేయాలని నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న హౌసింగ్ పీడీ, మేనేజర్, అకౌంటెంట్, టైపిస్ట్, ఇద్దర్ నైట్ వాచ్‌మెన్‌లు, ఇద్దరు అటెండర్లు, ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో కలిపి మొత్తం తొమ్మిది మంది పనిచేస్తున్నారు. సర్కారు తాజా నిర్ణయంతో వీరంతా ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం కానున్నారు. అలాగే ఆ శాఖకు సంబంధించిన జిల్లా కార్యాలయంతో పాటు డివిజన్ కేంద్రాల్లో ఉన్నటువంటి కార్యాలయ భవనాలన్నీ ఆర్‌అండ్‌బీ ఆధీనంలోకి రానున్నాయి.

ఉత్తర్వులు అందాయి

గృహ నిర్మాణశాఖను రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జిల్లాకు అందాయి. ప్రస్తుతం పనిచేస్తున్న వారిని ఆర్‌అండ్‌బీలో విలీనం చేస్తామని అందులో పేర్కొన్నారు. మార్గదర్శకాలు త్వరలో అందనున్నాయి. తమకు ఎలాంటి బాధ్యతలను అప్పగిస్తారనేదీ అందులో తేలనుంది.

– బసవేశ్వర్, హౌసింగ్ నోడల్ ఆఫీసర్

క్లుప్తంగా

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై ఫిర్యాదు

భైంసారూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై ఆదివారం భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని హంపోలి గ్రామానికి చెందిన చంద్రే సుశీలకు కుభీర్ మండలం సౌన గ్రామానికి చెందిన చంద్రే నాగేందర్‌తో గత మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. గత కొంతకాలంగా అదనపు కట్నం తేవాలని వేధిస్తుండడంతో గతనెల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మూడేళ్లుగా భర్త మారుతాడని భావించి సర్దుకుంటూ అతనితో జీవనం కొనసాగించింది. కట్నం వేధింపులు తీవ్రం కావడంతో పుట్టింటివారితో కలిసి ఫిర్యాదు చేసింది. తన పరిస్థితిని వివరించి న్యాయం చేయాలని కోరింది.

ఒకరి అదృశ్యం


ఇద్దరు పిల్లలతో పుష్పలత (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన కొంద్ర పుష్పలత అదృశ్యం కావడంతో భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్ కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. పుష్పలతకు భర్త పోశెట్టి తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత ఐదు రోజుల క్రితం పిల్లలను తీసుకుని వెళ్లిన పుష్పలత ఎక్కడ ఉందో తెలియరాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లలో, చుట్టూ ప్రాంతాల్లో ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. తల్లి సరళచంద్ర ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఆదిలాబాద్‌టౌన్: మనస్థాపంతో బొద్దింకల మందును తాగి చికిత్స పొందుతూ ఆదివారం మహిళ మృతిచెందింది. వన్‌టౌన్ ఎస్సై హరిబాబు కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అచ్చ సంతోష్ భార్య కవిత (42) ఈనెల 15న ఇంట్లో ఎవరు లేని సమయంలో బొద్దింకల మందు తాగింది. దీంతో కుటుంబీకులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తీసుకెళ్లగా ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందింది. కాగా, గత మూడు నెలల క్రితం వీరి కూతురు దీప్తి అనారోగ్యంతో మృతిచెందింది. అదేవిధంగా గతంలో మరో ఇద్దరు పిల్లలు సైతం మృతిచెందడంతో మనోవేదనకు గురైన ఆమె అఘాయిత్యానికి పాల్పడింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో చిన్న చిన్న ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో దాడులు చేసి పట్టుకున్నారు. క్రాంతినగర్‌కు చెందిన షేక్ అయాన్ తుక్కు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాత్నాల వైపు వ్యాపారానికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి అర కిలో గంజాయి ఈయనకు విక్రయించాడు. పలువురికి అమ్ముతుండగా 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పురుషోత్తంచారి తెలిపారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో ఆర్టిస్ట్ ద్యావంత్ రమేశ్ ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న బైక్ చోరీకి గురైంది. శనివారం సాయంత్రం 5.30 గంటలకు తన ఇంట్లో మంత్రి కేటీఆర్ ఫొటో ఆర్ట్ చేసే పనిలో నిమగ్నమయ్యాను. పూర్తయ్యాక రాత్రి 9.30 గంటలకు బయటకు వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా బైక్ ఆచూకీ దొరకలేదు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పేర్కొన్నాడు.

మెరుగైన సేవలందిస్తాం

ఆదిలాబాద్: ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. అన్ని బస్టాండ్లను ఆధునికీకరిస్తున్నామని, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని, ఆదాయం వచ్చే మార్గాల్లో బస్సులు నడుపుతా మని వెల్లడించారు. ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి ఆర్టీసీ లాభాల బాట పట్టేలా చూస్తామని ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

- లాభాల బాట పట్టించేందుకు చర్యలు
- ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెందొద్దు
- బస్టాండ్లను ఆధునికీకరిస్తాం
- 'సాక్షి'తో ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి


జానీరెడ్డి

సాక్షి: కేఎంపీఎల్ పేరిట డ్రైవర్లపై, కలెక్షన్ల పేరిట కండక్టర్లపై ఒత్తిడి పెరుగుతుందనే వాదనపై మీరేమంటారు?

ఆర్ఎం: అందులో ఎలాంటి వాస్తవం లేదు. సాంకేతికంగా వాహనశక్తిని ఉపయోగించుకుని కేఎంపీఎల్ ఎలా పెంచాలనే అంశాన్ని డ్రైవర్లకు తెలియజేస్తున్నాం. కలెక్షన్లు వచ్చే రూట్లలో తక్కువగా వస్తే ఆ దిశగా ఏం చేయాలనేది కండక్టర్లకు వివరిస్తున్నాం.

సాక్షి: బస్టాండ్లకు సమీపంలో ప్రైవేట్ బస్సులు నిలపడంపై ఏమంటారు?

ఆర్ఎం: ఆర్టీసీ బస్టాండ్లకు 2 కి.మీ పరిధిలో ప్రైవేట్ బస్సులు నిలపరాదనే నిబంధన ఉన్నాయి. ఈ విషయమై రవాణా, పోలీస్ శాఖల సహకారంతో బస్సులు నిలపకుండా చూస్తాం. రవాణాశాఖతో కలిసి సంయుక్తంగా అధిక లోడ్ ఉన్న ప్రైవేట్ వాహనాలు, లగేజ్ క్యారీయర్ ఉన్న బస్సులు స్టేజ్ క్యారీయర్లుగా నడుపుతుండడంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

సాక్షి: రోడ్డు సౌకర్యం ఉన్నా ఆదాయం వచ్చేమార్గాల్లో బస్సులు నడపడం లేదనే ఫిర్యాదులపై మీ స్పందన?

ఆర్ఎం: ఆదాయం ఉన్న మార్గాల్లో బస్సులు నడపుతాం. ఏ రూట్లలో అయినా సర్వీసులు లేకపోతే ప్రయాణికులు మా దృష్టికి తీసుకువస్తే పరిశీలించి ఏర్పాటు చేస్తాం. క్షేత్రస్థాయిలో అధికారుల నుంచి వివరాలు తీసుకుంటా

సాక్షి: బస్టాండ్లలో ఆహార పదార్థాలు అధిక ధరలకు విక్రయించడంపై చర్యలేంటి?

ఆర్ఎం: స్టాళ్లలో అధిక ధరలకు విక్రయిస్తే జరిమానా విధిస్తాం. నిర్వాహకులు ఎమ్మార్పీ ధరలను ప్రదర్శించాల్సి ఉంటుంది.

సాక్షి: రీజియన్ పరిధిలో చాలా బస్టాండ్లలో మౌలిక సదుపాయాలు లేవు?

ఆర్ఎం: ప్రతీ బస్టాండ్‌ను ఆధునికీకరిస్తున్నాం. మరమ్మతుతోపాటు పెయింటింగ్స్ వేసి అందంగా తీర్చిదిద్దుతున్నాం. మంచినీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడంపై దృష్టి సారించాం

సాక్షి: ఆక్యూపెన్సీ రేషియో (ఓఆర్) పెంచడానికి తీసుకుంటున్న చర్యలేంటి?

ఆర్ఎం: 'ప్రజల వద్దకు ఆర్టీసీ' వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తున్నాం. ప్రతి స్టేజి వద్ద ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు ఎక్కేలా చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: హైర్ బస్సులు పెరగడంతో ఉద్యోగుల ఆందోళనపై మీరేమంటారు?

ఆర్ఎం: ఉద్యోగులు ఈ విషయంలో ఆందోళన వద్దు. హైర్ బస్సుల్లో ప్రైవేట్ డ్రైవర్లు ఉన్నప్పటికీ కండక్టర్లే విధులు నిర్వహిస్తారు.

సాక్షి: సంక్రాంతికి గతంతో పోలిస్తే రీజియన్ పరిధిలో అధిక ఆదాయం వచ్చిందా?

ఆర్ఎం: ప్రయాణికుల రద్దీ అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేశాం. కంట్రోలర్లను, ప్యాసింజర్ గైడ్‌లను పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసి వారికి ఇబ్బంది లేకుండా సేవలందించాం. 60 రోజులకు ముందే రిజర్వేషన్ సౌకర్యం, తిరుగు ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పించాం. ప్రయాణికుల నుంచి స్పందన లభించడంతో ఆదాయం పెరిగింది. గతేడాది సంక్రాంతి సీజన్‌లో రూ.39.60 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 76.20 ఆదాయం వచ్చింది.

సాక్షి: ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో నష్టాల్లో ఉన్న డిపోలు లాభాల బాట పట్టేలా ఎలాంటి ప్రణాళికలు అమలు చేస్తారు?

ఆర్ఎం: ప్రతి బస్‌స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. సమయానుకూలంగా బస్సులు నడుపుతాం. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తాం. ఒకే ప్రాంతానికి చేరే బస్సులు ఒకే సమయంలో వెళ్లకుండా క్రమబద్ధీకరణ చేస్తాం. ప్రత్యేకంగా నష్టాల్లో ఉన్న డిపోలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రజలు ఆర్టీసీని ఆదరించి సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతున్నాం.

అ'పూర్వ'ం.. ఆత్మీయ వేడుక


నిర్మల్‌లో పాల్గొన్న ఆనాటి మిత్రులు

నిర్మల్‌ఖిల్లాగేట్: నిర్మల్‌లో 1973–75 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వీరి గోల్డెన్ జూబ్లీ వేడుకలకు పట్టణంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్ వేదికైంది. సుమారు 60 మందికి పైగా హాజరయ్యారు. ఎమ్మెల్యే, ప్రొఫెసర్, ఇతర రంగాల్లో ఉన్న తస్థాయికి ఎదిగిన వారు ఎందరో ఉన్నారు. రాజకీయ, విద్య, వ్యాపార, సాంస్కృతిక, నిర్మాణ రంగాల్లో స్థిరపడి, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు ఇక్కడకు వచ్చారు. కుటుంబం, పిల్లలు, మనుమళ్లతో ఉండాల్సిన వీరంతా పాత మిత్రులను కలిసేందుకు హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లో ఆనాడు గడిపిన క్షణాలు, మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. కొందరు మిత్రులు చనిపోగా వారికి సంతాపం ప్రకటించారు.


పాతమిత్రులతో కలిసి ఉన్న పూర్వ విద్యార్థులు

పొన్కల్‌లో విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మామడ: మండలంలోని పొన్కల్ జెడ్పీ సెకండరీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. 1994–95, 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కలుసుకుని ఒకరికొకరు యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానించారు.

శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో


ఎల్ఈడీ టీవీ అందిస్తున్న పూర్వవిద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1993–94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలకు తమ తరపున ఎల్ఈడీ టీవీ, సీసీ కెమెరాలు విరాళంగా అందజేశారు. అంతకుముందు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విభాగ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సహ కార్యదర్శి సరికొండ దామోదర్, పాఠశాల అధ్యక్షుడు డా నాగేశ్, ప్రధానాచార్యులు భోజన్న ఉన్నారు.

ఉపాధి పనులు పరిశీలన


పనుల వివరాలను నమోదు చేసుకుంటున్న గంగప్ప

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ, రాంపూర్ గ్రామాల్లో 2020-21, 2022-23 సంవత్సరాల్లో చేపట్టిన జరిగిన ఉపాధి హామీ పనులను ఆదివారం కేంద్ర గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) అధికారి గంగప్ప పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల రుణాలు, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీ, పంట కల్లాలు, పశువుల పాక, పల్లె ప్రకృతివనాలు, నీరు నిల్వ కోసం చేపట్టిన ట్రెంచ్ పనులు, స్వయం సహాయక సంఘాల రుణాలు, పెన్షన్ వివరాలు, పంచాయతీ రికార్డులు, వాటి వివరాలను లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. రాంపూర్‌లో పల్లె ప్రకృతి, అవెన్యూ ప్లాంటేషన్, ట్రెంచ్ పనులకు సంబంధించిన వివరాల పట్టికను అప్పటికప్పుడే నిర్మించి అసంపూర్తిగా వివరాలు ఉన్నవి, సమాచారం లేనివి చూసి టీఏ సతీశ్‌పై ఆయన అసహనం వ్యక్తం చేశారు. డీఆర్డీవో విజయలక్ష్మి, డీఆర్పీ గంగాప్రసాద్, ఎంపీడీవో వనజ, ఏపీవో సుగుణ, ఏపీఎం గురుచరణ్, టీఏలు సతీశ్, రవీందర్, పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, నవనీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేయూతకోసం క్రీడాకారిణి ఎదురుచూపు


నిఖిత

ఖానాపూర్: పట్టణానికి చెందిన జక్కుల నిఖిత ఇటీవల పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి అండర్ ఆర్మ్ క్రికెట్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. ఫిబ్రవరి 20 నుంచి 24 వరకు నేపాల్‌లో జరుగనున్న ఇండో నేపాల్ కప్ పోటీల్లో పాల్గొననుంది. 20 ఏళ్ల క్రితమే తండ్రి అకాల మరణం చెందగా తల్లి లక్ష్మి అన్నీతానై పెంచి పోషించింది. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే తన లక్ష్యానికి దాతలు చేయూతనిస్తే తాను పోటీల్లో పాల్గొంటానని తెలిపింది. దాతలు ఫోన్‌పే 7731990523 నంబర్‌కు డబ్బు పంపి ఆదుకోవాలని కోరుతోంది.

మామిడిగూడ హెచ్ఎం డిప్యూటేషన్ రద్దు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో డిప్యూటేషన్‌పై ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్న అశోక్ డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ హీరాసుక్క ఆదివాసీ పర్ధాన్ జాగృతి సమితి (టీహెచ్ఏపీజేఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్, జిల్లా అధ్యక్షుడు మెస్రం కృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిబంధనల ప్రకారం బాలికల ఆశ్రమ పాఠశాలలో సాయంత్రం 6 గంటల అనంతరం పురుష ఉపాధ్యాయులు ఉండకూడదన్నారు. అలాంటి నిబంధన ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఆ హెచ్ఎం రాత్రివేళలో అక్కడే బస చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలకు చెందిన పలు తరగతుల బాలికలను వారి వెంట మహిళా ఉపాధ్యాయురాలు లేకుండా ఇటీవల విహారయాత్రకు తీసుకెళ్లారన్నారు. సదరు హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌తోపాటు ఐటీడీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో స్పందించి సదరు హెచ్ఎం డిప్యూటేషన్‌ను రద్దు చేసి మహిళా ప్రధానోపాధ్యాయురాలిని నియమించాలని కోరారు. లేకపోతే విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అప్పటికి స్పందన రాకపోతే గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శితోపాటు గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఆ సమితి నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

భైంసాటౌన్: బైక్ అదుపుతప్పి వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు గాయపడిన ఘటనలు ఆదివారం చోటుచేసుకున్నాయి. పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన మురళీధర్ బైక్‌పై వస్తుండగా ఆర్టీసీ డిపో వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో కాలు విరిగింది. గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ వద్ద కిసాన్‌గల్లికి చెందిన సుశీల్ బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి పడగా కాలికి గాయమైంది. మహాగాంకు చెందిన గణేశ్ బైక్‌పై నుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వారిని ఏరియాస్పత్రికి తరలించారు.

రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి (55) కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో బల్లార్షా వైపు వెళ్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఒంటిపై ఆరెంజ్ కలర్ టీషర్ట్, చాక్లెట్ కలర్ స్వెటర్, ఆకుపచ్చని కలర్ నైట్ పాయింట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 9440900792, 9440700038లపై సంప్రదించాలని కోరారు.

27న రైతు భరోసా దీక్ష


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): రైతన్నల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతు సురక్ష సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతు భరోసా దీక్ష చేపట్టనున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అరికిల్ల అశోక్, ఆత్రం రాహుల్ గున్వంత్, రాజన్న, మల్లేశ్, కిరణ్, శ్రీనివాస్, రాము, భీంరావు, సతీశ్, రైతులు పాల్గొన్నారు.

మీరు సురక్షితంగా ఉండండి


కవాతు నిర్వహిస్తున్న పారామిలటరీ దళాలు

- పారామిలటరీ కమాండెంట్ మేజర్ శశాంత్ శేఖర్


మాట్లాడుతున్న కమాండెంట్ మేజర్ శశాంత్ శేఖర్

గుడిహత్నూర్: మీరు ప్రశాంతంగా ఉండండి మేము అన్నీ పరిశీలిస్తున్నాం.. ఎలాంటి అసాంఘిక, ఇతర శక్తులను తట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాం..అంటూ పారామిలటరీ కమాండెంట్ మేజర్ శశాంత్ శేఖర్ అన్నారు. 60 మంది పారామిలటరీ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన కవాతులో వీరు పాల్గొన్నారు. మొదట మండల కేంద్రంలో పాతహైవే రోడ్డు గుండా కవాతు నిర్వహించిన వీరు ముత్నూర్ రోడ్డు, ప్రధానవీధుల గుండా సాగుతూ ప్రధాన ఆలయాలు, మసీదుల ముందు నుంచి కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామన్య ప్రజలను, వారి జీవన విధానాన్ని ఇబ్బంది కల్గించే ఏ విషయానైనా స్థానిక పోలీసులు, తాము సీరియస్‌గా తీసుకుంటామన్నారు. ఈ కవాతులో సీఐ నైలూ నాయక్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఏఎస్సైలు రహమాన్, బలిరాం, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 9న పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978–2022 వరకు ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం ఏప్రిల్ 9న నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ వాల్గోట్ కిషన్ తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆదివారం కమిటీ సభ్యులు మాట్లాడారు. దాతల నుంచి విరాళాలను సేకరించాలని నిర్ణయించామని అన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం ఖర్చు పోను మిగిలిన నిధులను కళాశాల అభివృద్ధి కోసం వెచ్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించే దాతలు కె.భూమేశ్వర్(9908089075), ఏ.రవీందర్‌గౌడ్(9951198890) నెంబర్లలో ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా పంపాలని కోరారు. కిషన్ తనవంతుగా రూ.10 వేలు అందజేశారు. సమావేశంలో కాలేరి భూమేశ్వర్, బోనగిరి నరేందర్, మడిగెల గంగాధర్, చిలకూరి వెంకట్రాములు, అమరవేణి రవీందర్ గౌడ్, తుమ్మనపెల్లి వెంకటరమణ, కామాజి శ్రీనివాస్, పరంకుశం మురళీధర్, అమంద శంకర్, మామిడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

- తమ్ముడు మృత్యువాత.. అన్నకు గాయాలు


గిరిధర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు


గిరిధర్(ఫైల్)

నెన్నెల(భీమిని): ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతిచెందిన సంఘటన భీమిని మండలంలోని మల్లీడి గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్ వివరాల ప్రకారం... మల్లీడి గ్రామానికి చెందిన గుర్రాల గిరిధర్ (29), అతడి అన్న రాజశేఖర్ అదే గ్రామంలోని రైస్‌మిల్లుకు వడ్లు పట్టించేందుకు వెళ్తున్నారు. రాజశేఖర్ ట్రాక్టర్ నడుపుతుండగా గిరిధర్ పక్కనే కూర్చున్నాడు. గ్రామ సమీపంలోకి రాగానే కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గిరిధర్ సంఘటన స్థలంలోనే మృతిచెందగా రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108లో బెల్లంపల్లి ఆస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.




ప్రజాధనం వృథా..!

నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనుకాల ఉన్న ఖాళీ స్థలంలో గతేడాది టెన్నిస్ కోర్టు నిర్మించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో రూ.3 లక్షలు వెచ్చించారు. నిర్మించి ఏడాది గడవకముందే టెన్నిస్ కోర్టు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. దీంతో ప్రజాధనం వృథాగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

ఇచ్చోడలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్

ఇచ్చోడ: ఇచ్చోడ పట్టణంలోని ప్రధాన విధుల గుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆదివారం కవాతు నిర్వహించారు. ఇచ్చోడ సీఐ నైలు, గుడిహత్నూర్ ఎస్సై, హైదరాబాద్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శశాంక్ శేఖర్ 99 ఆర్ఏఎఫ్ ఆధ్వర్యంలో ఈ కవాతు సాగింది. ప్రమాదాలు జరిగినపుడు విపత్తుల నుంచి రక్షించడానికి ఈఫోర్స్ సహాయ పడుతుందన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



బహుమతి అందజేస్తున్న నాయకులు

బేల: మండలంలోని సదల్‌పూర్ భైరందేవ్, మహాదేవ్ జంగీ జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి బహుమతి సీతగూడ జట్టుకు రూ. 21వేలు, రన్నరఫ్ కరోని(కె) జట్టుకు రూ. 15 వేలు, తృతీయ బహుమతి పిటగావ్ జట్టుకు బహుమతి రూ. 10వేలు, నాలుగో బహుమతి సదల్‌పూర్ జట్టుకు రూ. 5వేల నగదును బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాక్రే గంభీర్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్ రావు, ఎంపీటీసీ కొడపే అరుణ్, సర్పంచ్‌లు కొరంగే జంగ్‌షా, తుకరాం, కేశవ్, నాయకులు పెందుర్ రాందాస్, గోడం సునీల్, మడావి గోవింద్ రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సుంకిడిలో రైతు మెస్ ప్రారంభం



ప్రారంభిస్తున్న సర్పంచ్ మహేందర్‌యాదవ్

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో ప్రతీ ఆదివారం సంతకు వచ్చే రైతులకు, గ్రామస్తులకు రూ. 30 రుపాయాలకు ఫుల్ మెస్‌ను ఆదివారం సర్పంచ్ మహేందర్ యాదవ్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. సంతకు మండలంలోని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు రావడం జరుగుతుందన్నారు. వారికి తక్కువ ధరకు భోజనం అందించాలనే ఉద్దేశంతో రైతు మెస్ ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకన్న, శశికాంత్, శంకర్, రాములు, ఆశన్న పాల్గొన్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్: వివిధ పనుల నిమిత్తం ఆదిలాబాద్ పట్టణానికి వచ్చే పేద ప్రజల ఆకలిని తీర్చాలనే ఉద్దేశంతో పట్టణానికి చెందిన సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అన్నదానం చేపట్టారు. ట్రస్ట్ సభ్యులు పేద ప్రజలకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా మహేశ్వర్, ఆలం, ట్రస్ట్ సభ్యులు సంగెం సుధీర్ కుమార్, మహేందర్ రెడ్డి, సలీం, సుభాష్ పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి రాజు దంపతులను ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం సన్మానించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో రైతుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సేవ్వ జగదీష్, మల్లేష్, బుచ్చన్న, ఆశిరెడ్డి, రమేష్, వీరయ్య, సాంబయ్య, అరవింద్, వెంకటేష్, అనిల్, వినోద్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని 43వ వార్డు విద్యానగర్ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్‌ను కాలనీవాసులు ఆదివారం సన్మానించారు. గత కొన్ని సంవత్సరాలుగా 33 కేవీ విద్యుత్ తీగలు ఇళ్లపై ఉండడంతో భయం భయంగా జీవనం సాగిస్తున్నామన్నారు. ఈవిషయం కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లగా.. తీగలను పూర్తిగా తొలగింపజేశారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇసుక తోడేస్తున్నారు!





జైనథ్ మండలం పెన్‌గంగా పరీవాహక ప్రాంతాల్లో జోరుగా ఇసుక రవాణా జరుగుతోంది. పూసాయి గ్రామ వీడీసీ పేరుతో ఈదందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. రోజు వందల ట్రాక్టర్లతో ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలించి అందినకాడికి దండుకుంటున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నా.. ఏమి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అటెన్షన్ ప్లీజ్ — పొంచి ఉన్న ప్రమాదం



గుడిహత్నూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న హైవే కెనాల్‌పై ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వల మూతతో ప్రమాదం పొంచి ఉంది. బస్సుల రాకపోకలు దానిపై నుంచి సాగడంతో కుంగి వంగి పైకి చువ్వలు తేలాయి. అధికారులు స్పందించి దీనిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: జానిరెడ్డి, ఆర్ఎం, ఆదిలాబాద్, ఫోన్: 99592 25996

ఎంప్లాయ్‌మెంట్ కార్డు.. ఇక శాశ్వతం

- గతంలో మూడేళ్లకోసారి రెన్యూవల్
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుకు అవకాశం
- తీరనున్న ఇబ్బందులు

జిల్లాల వారీగా రిజిస్ట్రేషన్ వివరాలు..

ఆదిలాబాద్	5,649
నిర్మల్	4,387
మంచిర్యాల	14,315
ఆసిఫాబాద్	2,181



జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం

నేరడిగొండ: ఎంప్లాయ్‌మెంట్ కార్డు పొందేందుకు నిరుద్యోగ యువత గతంలో అనేక ఇబ్బంది పడేవారు. కార్డు పొందిన ప్రతీ మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవడం కోసం నానా తిప్పలు పడాల్సి వచ్చేది. సకాలంలో రెన్యూవల్ చేయించకపోతే సీనియార్టీ కోల్పోవాల్సిన దుస్థితి. ఈ ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం శాశ్వత ఎంప్లాయ్‌మెంట్ (ఉపాధి) కార్డులు జారీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ ఇలా చదువులు పూర్తయిన వారు ఉపాధి కల్పన (ఎంప్లాయ్‌మెంట్) కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకుంటారు. ఇక్కడ పేర్లు నమోదు చేసుకుని ఉపాధి కార్డు పొందితే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్న నమ్మకం వారిలో ఉంటుంది. కొన్ని కంపెనీలు సైతం సదరు కార్డులను అడుగుతున్నాయి. ఇకపై నిరుద్యోగులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టింది.

కొత్త విధానంతో..

జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా ఎంప్లాయ్‌మెంట్ కార్డుల జారీలో ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం నిరుద్యోగ యువత ఒకసారి ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకుంటే సరిపోతుంది. శాశ్వత కార్డులు జారీ చేస్తారు. ప్రతీ మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. గతంలో సకాలంలో స్పందించకపోతే కార్డులు రద్దయ్యేవి. ఇకపై అలాంటి సమస్యలు ఉండవు.

ఆన్‌లైన్ ద్వారా..

నిరుద్యోగ యువత మీసేవ కార్యాలయాల్లో ఉపాధి కార్డులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ సదుపాయం ఉన్నవారు తమ తమ ఫోన్‌లోనూ ఈప్రక్రియ పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలోనూ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏవైన సందేహాలు ఉంటే అభ్యర్థులు ఉపాధికల్పన కార్యాలయంలో సంప్రదించవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



నిరుద్యోగ యువతకు శాశ్వత ఎంప్లాయ్‌మెంట్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుంది. ఈఅవకాశాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. సందేహాలు, సమస్యలు ఉంటే జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలి.

విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఉపాధి కల్పన అధికారి, ఆదిలాబాద్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



చెక్కులు పంపిణీ చేస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 11 మందికి సంబంధించిన రూ.1లక్ష 25వేల చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్య చికిత్సలను ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయించుకున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. బాధితులు ఎవరైనా ఉంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, వేణుగోపాల్ యాదవ్, సంజయ్, వినోద్, ఖయ్యూం పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందిస్తాం

ఆదిలాబాద్‌రూరల్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యనందిస్తామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. స్వచ్ఛ సర్వేక్షన్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి చెత్త శుద్ధి కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. నిరుపేద విద్యార్థులకు అత్యుత్తమ విద్యాబోధన అందిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో గ్రామాల అభివృద్ధి

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని సావర్గాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. తాంసి, భీంపూర్ మండలాలలోని పలు గ్రామాలకు బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భారత్, వైస్ ఎంపీపీ రఘు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, పంచాయతీ రాజ్ ఏఈ శివరాం, సదానందం, బీఆర్ఎస్ కన్వీనర్ అరుణ్, శ్రీధర్ రెడ్డి, కేశవ్ రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పంటలు ధ్వంసం



అడవిపందులు ధ్వంసం చేసిన శనగపంట

తాంసి: రైతులు సాగు చేసిన పంటలకు అడవిపందుల బెడద తప్పడం లేదు. శనగ పంటలపై దాడులు చేసి, పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. తాంసి మండల కేంద్రానికి చెందిన కనపర్తి ప్రసాద్ సాగు చేసిన శనగ పంటను శనివారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. దాదాపు ఎకరానికి పైగా పంట నశనం అయింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు పంటను పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని రైతు కోరుతున్నాడు.

అనాథ బాలల హక్కులు కాపాడాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: అనాథ బాలల హక్కులను కాపాడాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆదివారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అనాథ బాలల హక్కుల కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభించి, కేజీ నుంచి పీజీ ఉచిత విద్య అందిస్తానని చెప్పి ఏడేళ్లు గడుస్తున్నా.. నేటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బాక సుభాష్ మాదిగ, కో కన్వీనర్ సిరిసిల్ల భూమయ్య, మధుకర్, కల్లేపల్లి రాజు, కాశపాక విష్ణు, మచ్చ గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

తలమడుగు: మండలంలోని పల్లి(బి) గ్రామంలో ఆదివారం బీసీ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కట్కం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, గౌరవ అధ్యక్షుడిగా విఠల్, సభ్యులుగా శంకర్, ఓంప్రకాష్, ఆశన్న, వెంకటేశ్, గణేశ్, భోజన్న, రాజన్నలను ఎన్నుకున్నారు. నాయకులు మాట్లాడుతూ.. బీసీ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యవర్గ సభ్యులను సర్పంచ్ మాల్కు ఘనంగా సన్మానించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



రోగులతో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్

ఉట్నూర్: సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సీహెచ్‌సీ చరిత్రలో మొదటి సారి కాన్పు సర్జరీ విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగైన పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో జీవ వైవిధ్య జిల్లా కమిటీ సభ్యుడు మర్సకొల తిరుపతి, వైద్యాధికారులు మహేందర్, తులసి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ

బజార్‌హత్నూర్: జిల్లాలో 100 యూనిట్లు విద్యుత్ సబ్సిడీ పొందుతున్న లబ్ధిదారులు తమ అర్హత ధ్రువీకరణ పత్రాలను ఈనెల 30లోగా విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందజేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 100 యూనిట్ల లోపు వినియోగించిన సబ్సిడీ విద్యుత్ బిల్లులను విద్యుత్ శాఖకు ఎప్పుడు చెల్లిస్తే అప్పుడు వర్తిస్తుందన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు ప్రతీ రైతు కెపాసిటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ, ఏడీఈ సుబ్రహ్మణ్యం, సబ్‌ఇంజనీర్ రవికుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు పాల్గొన్నారు.

చెలల్లోనే తెల్ల బంగారం..



జైనథ్: పత్తికి ధర లేకపోవడంతో పత్తి ఏరేందుకు రైతులు అనాసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే ఇంటికి తెచ్చిన పత్తిని అమ్మకుండా నిల్వ ఉంచుకున్న రైతులు, చేను నిండా పత్తి విరగబూసినా.. ఏరడం లేదు. మార్కెట్‌లో ఇప్పుడున్న ధరకు అమ్ముకుంటే కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. భోరజ్ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారి పక్కన ఓరైతు విరగబూసిన పత్తిని ఏరకుండా అలాగే వదిలేయడంతో చేనంత తెల్ల బంగారమైంది.

వేతనాలు అందేదెప్పుడో?

- నాలుగు నెలలుగా చెల్లింపుల్లో జాప్యం
- ఇబ్బంది పడుతున్న విలేజ్ వర్కర్లు



స్తంభం ఎక్కి పని చేస్తున్న విలేజ్ వర్కర్

బేల: విద్యుత్‌శాఖ పరిధిలో క్షేత్రస్థాయిలో ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ.. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా పని చేస్తున్న విలేజ్ వర్కర్ల వేతనాలు పెండింగ్ ఉన్నాయి. గత నాలుగు నెలల నుంచి చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. దీంతో విలేజ్‌వర్కర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

నాలుగు నెలలుగా..

కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న విలేజ్ వర్కర్లకు గత జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల వేతనాలు రావాల్సి ఉండగా.. ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు నెలల వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. మరో నాలుగు నెలల వేతనాలు ఇంకా రావాల్సి ఉంది. ఈ వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

విధి నిర్వహణ ఇలా..

జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలో ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజన్‌లు ఉన్నాయి. ఆదిలాబాద్ టౌన్, ఆదిలాబాద్ రూరల్, జైనథ్ సబ్ డివిజన్‌లు ఉండగా.. 20 సెక్షన్‌లున్నాయి. ఈపరిధిలో మొత్తంగా 96 మంది విలేజ్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరికి జిల్లా విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ అనుసంధానంగా ప్రతీ నెల వేతనం రూ.8,400 నగదును బ్యాంకు ద్వారా చెల్లిస్తోంది. వీరంతా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌ల పర్యవేక్షణలో బ్రేక్‌డౌన్ సమయంలో స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తారు. దీంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ లేని సమయంలో ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతీ నెల విద్యుత్ మీటరు బిల్లు రీడింగ్, బిల్లుల వసూలులోనూ కీలకంగా పని చేస్తున్నారు. కానీ వేతనాలు చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు ఇవ్వడం లేదు



గత జూలై నుంచి డిసెంబర్ నెల వరకు ఆరు నెలల వేతనాలు రావాల్సి ఉండగా, సంక్రాంతి పండుగ తర్వాత రెండు నెలల వేతనాలు వచ్చాయి. మరో నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు.

– కిశోర్, విలేజ్ వర్కర్

ఇబ్బంది పడుతున్నాం



వేతనాలు నెలల తరబడి పెండింగ్ ఉంటున్నాయి. సకాలంలో రావడం లేదు. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కుటుంబపోషణ భారం అవుతోంది. వేతనాల గురించి రేపు, మాపు వస్తాయని చెబుతున్నారు.

– జమ్ము, విలేజ్ వర్కర్

ఆయిల్‌పాం సాగుపై అవగాహన



ఆయిల్‌పాం క్షేత్రంలో రైతులు

బేల: మండలంలోని ఆయా గ్రామాల రైతులకు ఆదివారం ఖమ్మం జిల్లా అశ్వరావుపేట దుమంగూడ మండలం మల్కర్‌లో రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. చీడ పీడలు, ఎరువుల ఖర్చు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏటా దిగుబడితో వచ్చే ఆదాయం, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి కమిటీ సభ్యుడు తాక్రే మంగేష్, బీఆర్ఎస్ నాయకులు సతీష్ పవార్, గేడాం మనోజ్, చౌహాన్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.